స్ట్రాంగ్‌రూమ్‌లకు ఈవీఎంల తరలింపు

జిల్లా ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్ బాషా

ఈవీఎం గోదాంలో పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 19 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లను పటిష్ట బందోబస్తు మధ్య శుక్రవారం స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణంలోని గోదాము నుంచి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు, వీవీ ప్యాడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచనల మేరకు జిల్లాలోని జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు బ్యాలెట్ యూనిట్స్ 1085, కంట్రోల్ యూనిట్స్ 1085, వీవీ ప్యాడ్స్ 1216ను ఆయా నియోజకవర్గాలకు చెందిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించినట్లు తెలిపారు. బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాడ్స్ స్కానింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి, జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు రోహిత్ సింగ్, కొమురయ్య, వెంకన్న, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం పార్టీల ప్రతినిధులు రావెల రవి, చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌భాస్కర్, జోగు ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు విలువైంది

స్వీప్ జిల్లా నోడల్ అధికారి వినోద్‌కుమార్

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

జనగామరూరల్, ఏప్రిల్ 19 : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్వీప్ జిల్లా నోడల్ అధికారి వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెంబర్తిలో ఉపాధిహామీ కూలీలకు ఓటు హక్కుపై ఆయన అవగాహన కల్పించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. మే 13న పోలింగ్ జరుగనున్నందున అంతకుముందే అర్హులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని వినోద్‌కుమార్ సూచించారు. ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమన్నారు. సమాజంలో మంచి చేసే నాయకుడిని ఎన్నుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు.

విద్యుత్ ప్రమాదాలను నివారించాలి

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 19 : విద్యుత్ ప్రమాదాల నివారణకు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. దేవరుప్పుల సబ్ డివిజన్‌కు చెందిన విద్యుత్ శాఖ ఉద్యోగులకు సీఎండీ వరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలని తెలిపారు. వినియోగదారులకు సంబంధించిన బిల్లింగ్, రెవెన్యూ వసూళ్లు, సరిగా పనిచేయని మీటర్లను సరి చేయాలని కోరారు. విద్యుత్ లైన్లను పర్యవేక్షించడంతోపాటు, నిర్వహణ, లోపాలను సరిచేయాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, మరమ్మతు పనులు, కొత్త లైన్ల నిర్మాణంలో పాటించాల్సిన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వినియోగదారులు, రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసి విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణు మాధవ్, డీఈలు లక్ష్మీనారాయణరెడ్డి, విజయ్‌కుమార్, ప్రభావతి, ఏడీఈ అనిల్ కుమార్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

జఫర్‌గఢ్, ఏప్రిల్ 19 : మండల సభ్య సమావేశాన్ని శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేశ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాల్‌లో ఎంపీపీ రడపాక సుదర్శన్ అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి మండలంలోని ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మండల అధికారులు సకాలంలో హాజరు కావాలని సురేశ్ కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

లోన్స్

★SBH లో ఖాతా ఉన్న ప్రభుత్వ ఉద్యోగస్తులకు శుభవార్త, ఎటువంటి సమస్యలున్న Solve చేసి లోన్స్ ఇప్పించబడును. సంప్రదించండి సెల్ : 9493910808.
TW-323304

ఆదిత్య శ్రీ రియాల్టర్స్ & డెవలపర్స్

★మీకు సంబంధించిన ఖాళీ స్థలాలను గానీ, ఇళ్ళ స్థలాలను గానీ, వ్యవసాయ స్థలాలను గానీ మాకు డెవలప్‌మెంట్‌కి ఇవ్వండి మీరు ఆశించినంత పొందండి సంప్ర: 9394326111, 7981174745.
NTW-323040

VEHICLES FOR SALE

★AP25AQ-3132 RAVINDER THOTA RAPID 1.5 TDI CR ELEGANCE DIESEL 5 SEATER 2012 TS03UB-0736 SRINIVAS PINDI MAHINDRA DI 3200 FBT 2015 Auction Date 20-04-2024. Venue : Shriram Auto Mall India Ltd Bollikunta Warangal. Cont: Shriram Finance Limited H.No: 4-316, 4-317, 4-318, Ground Floor, Parkal, Warangl. Cell : 9704123166, 998976642
NTW-000

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899
NT-311829

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA	WARANAGAL
9182777563	9182777556
9182777618	9182777557

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి

- **బీఆర్‌ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలి**
- **మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎర్రబెల్లి

కొడకండ్ల, ఏప్రిల్ 19 : పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి బీఆర్‌ఎస్‌కు ఘన విజయం చేకూర్చాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి బరిలో నిలిచిన పార్టీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు సిందె రామోజీ అధ్యక్షతన శుక్రవారం బూత్ స్థాయిలో కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో అందరూ ఐక్యంగా నిలిచి ముందుకెళ్లాలన్నారు. కలిసికట్టుగా పని చేసి సుధీర్‌కుమార్ విజయం కోసం కృషి చేయాలన్నారు. ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చలేదన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని ఎర్రబెల్లి కోరారు. కాంగ్రెస్ వైఫల్యాలను బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రజలకు వివరించి ఓటు అడుగాలన్నారు.

బీఆర్‌ఎస్‌పై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేలా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. గత కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండేదన్న విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చిత్తశుద్ధతో కృషి చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డి బురద జల్లాలని చూస్తున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ నేతల బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు భయపడేది లేదని ఆయన స్పష్టం చేశారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిక

కొడకండ్ల మండలం గుమ్మలబండ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు గుగులోత్ విజయ్‌కుమార్ శుక్రవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇతడితోపాటు బానోత్ శ్రీను, బానోత్ శంకర్, సంతోష్, బానోత్ సోమ్లు గులాబీ కండువాలు కప్పుకున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మండలంలోని రామవరం మాజీ ఉపసర్పంచ్ తండ ఆంజనేయులు కుటుంబాన్ని, కాంగ్రెస్ నాయకుడు మేటి రాములు కుటుంబాన్ని ఎర్రబెల్లి వేర్వేరుగా పరామర్శించారు. కార్యక్రమంలో జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పేరం రాము, సొసైటీ వైస్ చైర్మన్ మేటి సోమరాములు, సీనియర్ నాయకులు బాకీ ప్రేమ్‌కుమార్, మండల యూత్ అధ్యక్షుడు దేశగాని సతీశ్, ఎస్టీసెల్ అధ్యక్షుడు భూక్యా మంగ్యానాయక్, మాజీ సర్పంచ్ మందుల శిరీషామల్లేశ్, తాళ్ల శోభన్, ఎడెల్లి రణధీర్ పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపు ప్రారంభం

ఫర్టిలైజర్ షాపును ప్రారంభిస్తున్న ఎర్రబెల్లి

దేవరుప్పుల, ఏప్రిల్ 19: మండలంలోని కోలుకొండలో ఏర్పాటు చేసిన ఫర్టిలైజర్ షాపును మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. మండలంలో పలు కార్యక్రమాలకు హాజరైన ఎర్రబెల్లి బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు కాముని నర్సింహస్వామి ఏర్పాటు చేసిన ఫర్టిలైజర్ షాపును ప్రారంభించి మాట్లాడారు. అనంతరం దుబ్బతండాలో డీఎస్పీ లకావత్ దేవేందర్–సుగుణ కుమారుడు ప్రదీప్‌కుమార్– స్వప్నకుమారి వివాహం జరుగగా వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు ఖాసీం, కోతి ప్రవీణ్, పాము మోహన్, బోనగిరి యాకస్వామి పాల్గొన్నారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

22 నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు

జఫర్‌గఢ్, ఏప్రిల్ 19 : మండల కేంద్రంలోని శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం ఈ నెల 22నుంచి 24వ తేదీ వరకు జరుగనుంది. ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, గౌరవాధ్యక్షుడు అన్నెబోయిన భిక్షపతి, కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంచాల ఎల్లయ్య, అన్నెబోయిన భిక్షపతి మాట్లాడుతూ మూడు రోజులపాటు శ్రీ ఉమానీలకంఠ శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉంటుందన్నారు. వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు తాటికాయల యాకయ్య, కోశాధికారి యుగేందర్ పాల్గొన్నారు.

కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులు

వైభవంగా రాములోరి బ్రహ్మోత్సవాలు

ఆలయంలో ఉత్సవమూర్తులు

లింగాలఘనపురం, ఏప్రిల్ 19 : మండలంలోని నవాబుపేట కోదండరామస్వామి ఆలయంలో ఈ నెల 9 నుంచి ప్రారంభమైన రాములోరి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా , హోమబలిహరణం, పూర్ణాహుతి, చక్రస్నానం, పుష్పయాగం, ఏకాంతసేవ, ఆశీర్వచనం, పండిత సన్మానం, స్వస్తి ప్రసాదవితరణ నిర్వహించారు. వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి మొక్కులు సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో లక్ష్మీప్రసన్న, కుర్రెముల మోహన్, వసంత, రవితేజ, సరోజన, ఎల్లగౌడ్, అర్చకులు లక్ష్మణాచార్యులు, కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

22లోపు పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 19 : పాలిటెక్నిక్ (పాలిసెట్–2024) ప్రవేశ పరీక్ష కోసం అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేయాలని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోచయ్య తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఫీజు రూ. 250, ఇతరులు రూ.500 ఫీజు చెల్లించి WWW.POLYCET.SBTET.TELANGAN.GOV.INకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. రూ.100 అపరాధ రుసుముతో 24తేదీ వరకు, రూ.300రుసుముతో ఈ నెల 26తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మే 24న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

దేవరుప్పుల, ఏప్రిల్ 19 : మండల కేంద్రంలోని కొత్తవాడలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం యశస్వినీరెడ్డి మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధర పొందాలని కోరారు. ప్రైవేట్‌లో వ్యాపారులకు తక్కువ ధరలకు విక్రయించి మోసపోవద్దని ఆమె సూచించారు. మరోవైపు ఎండల తీవ్రత ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో ముందు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. రైతులకు నీడతో పాటు తాగునీటి వసతి, వడదెబ్బ నివారణకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు.

బైక్ దొంగకు రిమాండ్

రఘునాథపల్లి, ఏప్రిల్ 19: బైక్ దొంగిలించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కంచనపల్లికి చెందిన ఎలిశాల ఉప్పలయ్య ఈనెల 9న తన పొలం వద్ద బైక్‌ను పార్క్ చేసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. ఈ క్రమంలో హనుమకొండ జిల్లా పలివేల్పులకు చెందిన ఇరగదిండ్ల భాస్కర్ బైక్‌ను చోరీ చేశాడు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో ఈనెల 18న నిడిగొండలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా భాస్కర్ చిక్కాడు. బైక్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు భాస్కర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

అకాడమిక్ మానిటరింగ్ సెల్ జిల్లా ఆధికారి శ్రీనివాస్

అరుణను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బచ్చన్నపేట, ఏప్రిల్ 19 : ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని అకాడమిక్ మానిటరింగ్ సెల్ జిల్లా అధికారి శ్రీనివాస్, ఎంఈవో భగవాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొడవటూరు ప్రాథమిక పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన నేతికొప్పుల అరుణకు వీడ్కోలు సమావేశాన్ని బాలమల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ దంపతులను ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో ఉన్నతమైంది ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు. అరుణ విద్యార్థుల ఉన్నతిపై చూపిన శ్రద్ధ ప్రత్యేకమైందన్నారు. ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు చంద్రశేఖర్‌రావు, పృథ్వీరాజ్, యాదయ్య, యాదగిరి, కేశవరావు, బాల్నె శ్రీనివాస్, సంతోష్‌కుమార్, బందారపు లక్ష్మయ్య, వేణుగోపాల్ మాట్లాడుతూ అరుణ వృత్తిని దైవంగా భావించి పాఠశాలలో తనదైన మార్కు చూపారన్నారు. అనంతరం ఉపాధ్యాయులు డీ బాలమల్లయ్య, మహంకాళి యాదగిరి, బాల్నె శ్రీనివాస్, చెన్నమాధవుని శరత్ కళ, విద్యార్థి బృందం అరుణకు జ్ఞాపిక అందించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సెక్టారు అధికారులు తోట రాజు, రమేశ్, సీఎంవో నర్సింహారావు, ఉపాధ్యాయులు శ్యామ్‌మోహన్‌రాజ్, దమ్ము నర్సింహారెడ్డి, రామచంద్రం, మంగ పాల్గొన్నారు.

గిర్నితండా చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఏసీపీ

కొడకండ్ల, ఏప్రిల్ 18 : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మండలంలోని గిర్నితండా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును వర్ధన్నపేట ఏసీపీ అంబాల నర్సయ్య శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అనంతరం వాహనాల తనిఖీ చేపట్టి పోలీసులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యాక్రమంలో సీఐ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 19 : ప్రమాదశాత్తు రైలు నుంచి జారిపడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన స్టేషన్‌ఘన్‌పూర్ శివారులో జరిగింది. జీఆర్పీ కాజీపేట ఎస్సై మొహినుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్, నష్కల్ రైల్వే స్టేషన్ల మధ్య ఎగువ లైన్‌లో శుక్రవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని రైలులో ఖమ్మం జిల్లా కోమట్లగూడెం మండలం గిద్దెవానిగూడేనికి చెందిన బానోత్ గాంధీలాల్(24) వస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి అతడు జారిపడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడని మొహినుద్దీన్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించామన్నారు.

ఆస్పత్రికి వెళ్లి వస్తానని అనంతలోకాలకు..

దుద్దెడ వద్ద రోడ్డు ప్రమాదంలో బచ్చన్నపేట వాసి దుర్మరణం

అశోక్ (ఫైల్)

బచ్చన్నపేట, ఏప్రిల్ 19 : ఆసుపత్రికి వెళ్లి వస్తానని చెప్పిన వ్యక్తి రోడ్డు ప్రమాదంతో అనంతలోకాలకు వెళ్లిన ఘటన మండల కేంద్రంలో విషాదాన్ని నింపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సందెల అశోక్(65) శుక్రవారం ఉదయం సిద్దిపేటలోని దవాఖానకు వెళ్లి వస్తానని చెప్పి స్కూటీపై బయల్దేరాడు. మార్గమధ్యంలో వెలికట్టె నుంచి రాజీవ్ రహదారికి చేరుకుని సిద్దిపేట వైపు వెళ్తుండగా హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు అతి వేగంగా వస్తున్న ఆటో గూడ్స్ వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో అశోక్ కిందపడి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో గూడ్స్ డ్రైవర్ అజాగ్రత్తతోనే తన తండ్రి మృతి చెందాడని కుమారుడు లక్ష్మణ్ కుకునూర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దవాఖానకు వెళ్లి వస్తానని చెప్పి బయల్దేరిన వ్యక్తి అంతలోనే దుర్మరణం చెందడంతో కుటుంబాన్ని దుఃఖ సాగరంలో ముంచింది. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులున్నారు. సిద్దిపేట ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బచ్చన్నపేటకు తరలించారు.

నిందితులను పట్టిస్తే పారితోషికం : సీఐ

సీసీ కెమెరాలో రికార్డు అయిన నిందితుల ముఖచిత్రాలు

జనగామ చౌరస్తా, ఏప్రిల్ 19 : ఇటీవల జనగామ చౌరస్తాలో మతిస్థిమితం లేని బోయిని భాస్కర్ అనే యువకుడిని కర్రలతో విచక్షణరహితంగా కొట్టి చంపిన కేసులో మరో నలుగురు నిందితులను పట్టిచ్చిన వారికి పారితోషికం ఇవ్వనున్నట్లు జనగామ అర్బన్ సీఐ ఎల్ రఘుపతిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సీసీ కెమెరాలో రికార్డయిన నిందితుల ముఖ చిత్రాలను సోషల్ మీడియాలో విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లికి చెందిన కుర్ర కమలాకర్, కళాధర్, చిర్ర శ్రావణ్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మరో నలుగురు నిందితులను గుర్తించాల్సి ఉందన్నారు. నిందితులను పట్టించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సూచించారు. ఆచూకీ తెలిసిన వారు సీఐ సెల్ నంబర్ 8712685202 లేదా ఎస్సై8712685260, పీఎస్ 8712685302లో సంప్రదించాలన్నారు.

సారా విక్రయించిన ఇద్దరికి జరిమానా, జైలు

చిల్పూరు, ఏప్రిల్ 19 : నిషేధిత నాటు సారా తయారు చేసి విక్రయించిన ఒకరికి జరిమానా, మరొకరి జైలు శిక్ష విధిస్తూ స్థానిక తహసీల్దార్, మండల మేజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని లింగంపల్లి శివారు యాపలబోడు తండాకు చెందిన ముడావత్ ఛత్రు, కొమ్మరాజుల ఎల్లయ్య సారా తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. నిందితులను శుక్రవారం స్థానిక తహసీల్దార్ సరస్వతి ఎదుట బైండోవర్ చేయగా వారికి రూ.లక్ష చొప్పున జరిమానా విధించారు. నిందితుల విజ్ఞప్తి మేరకు రూ.50వేలకు జరిమానా తగ్గించగా, ముడావత్ ఛత్రు జరిమానా చెల్లించాడు. ఎల్లయ్య జరిమానా చెల్లించకపోవడంతో చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించినట్లు స్టేషన్‌ఘన్‌పూర్ ఎక్సైజ్ సీఐ జీ భాస్కర్‌రావు, ఎస్సై నరేశ్ తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు దస్తగిరి, శ్రీనివాస్, రాంబాబు పాల్గొన్నారు.

కొడకండ్ల వాలుతండాకు చెందిన మహిళకు..

కొడకండ్ల, ఏప్రిల్ 19 : మండలంలోని రామన్నగూడెం వాలు తండాకు చెందిన కునుసోత్ సారా విక్రయిస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడింది. ఈ నేపథ్యంలో నిందితురాలిని శుక్రవారం తహసీల్దార్ అంజయ్య ఎదుట హాజరుపర్చగా, సరితకు రెండు నెలలు జైలు శిక్ష విధిస్తూ ఆదేశాలిచ్చారు. దీంతో ఆమెను నర్సంపేట ప్రత్యేక మహిళా కారాగారానికి రిమాండ్‌కు తరలించినట్లు పాలకుర్తి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బీ సంతోష్‌రెడ్డి తెలిపారు.

భర్త ఆత్మహత్యకు కారకులైన

భార్య, కుమారుడి అరెస్టు

రఘునాథపల్లి, ఏప్రిల్ 19 : భర్త ఆత్మహత్యకు కారకులైన భార్య, కుమారుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఫత్తేషాపురానికి చెందిన వృద్ధురాలు ఎండీ బిజాన్బీకి కూతురు, కుమారుడు ఉన్నారు. కోడలు భోజనం పెట్టకుండా ఇబ్బందులకు గురి చేసేవారు. విషయం తెలుసుకున్న బిజాన్బీని ఆమె కుమార్తె గౌసియాబేగం ఏడాది క్రితం తన ఇంటికి తీసుకెళ్లి పోషించింది. ఇల్లు నిర్మించుకునేందుకు పనులు చేపట్టిన నేపథ్యంలో ఇటీవల తల్లిని తన సోదరుడు అఫ్జల్ మియా ఇంటి వద్ద చేర్చింది. బిజాన్బీకి భోజనం పెట్టడం ఇష్టంలేని కోడలు సఫియాబేగం మనుమడు జమీల్‌పాషా ఆమెను నానా ఇబ్బందులకు గురిచేశారు. గమనించిన అఫ్జల్‌మియా తల్లి బాధను చూడలేక ఈనెల 13న పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు సఫియాబేగం, జమీల్‌పాషాను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

పాలకుర్తి : పెద్ద తండా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో సిబ్బంది

తరిగొప్పుల : అబ్దుల్‌నాగారంలో మాట్లాడుతున్న వసంత

దేవరుప్పుల, ఏప్రిల్ 19: అంగన్‌వాడీ కేంద్రాలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. మండలంలోని చినమడూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డేతోపాటు ఈసీసీఈ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీదేవి ప్రాథమిక పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిస్తే ఆరోగ్యంతోపాటు విజ్ఞానం అందిస్తారన్నారు. ఆటపాటలతో మానసికోల్లాసం కలిగి చదువులో రాణిస్తారని శ్రీదేవి వివరించారు. మరోవైపు ఈసీసీఈ(ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్) వేడుకలు నిర్వహించి చిన్నపిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చుకుంటున్నట్లు ఆమె తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు దూడల నర్స మ్మ, మందాటి లలిత, మైదం హైమావతి, ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి, ఆశవర్కర్లు స్వప్న, అనిత, శోభ, ఆయాలు యాకమ్మ, గీత పాల్గొన్నారు.

రఘునాథపల్లిలో..

రఘునాథపల్లి అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో మానసికోల్లాసం అందిస్తూ నాణ్యమైన విద్య బోధిస్తున్నట్లు అంగన్‌వాడీ టీచర్ రమాదేవి అన్నారు. మండలంలోని శ్రీమన్నారాయణపురం అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం స్కూల్ డే నిర్వహించారు. రమాదేవి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం వినియోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. శిశువుకు తల్లి పాలు పట్టించడం ద్వారా బిడ్డలో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. చిన్నారులను అంగన్‌వాడీ సెంటర్లకు పంపించాలని ఆమె కోరారు.

చిల్పూరులో..

చిల్పూరు : అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిబాబు అన్నారు. మండలంలోని మల్కాపూర్‌లో అంగన్‌వాడీ 1, 2, 3, 4 కేంద్రాల్లో శుక్రవారం స్కూల్ డే నిర్వహించారు. చిన్నారులను అలంకరించి వేడుకలు కొనసాగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, సరస్వతి, శోభారాణి, కల్యాణి, అంగన్‌వాడీ టీచర్లు విజయరాణి, రోజారమణి, జ్యోతి, వాణి సర్వర్ణ, గర్భిణీలు, బాలింతలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి : అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులకు పంపిస్తే నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీ మల్లేశ్వరి అన్నారు. శుక్రవారం మండలంలోని బమ్మెర పెద్దతండ అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఐదేళ్ల పూర్తి చేసుకున్న పిల్లలను ప్రాథమిక పాఠశాలలో ప్రవేశానికి పంపేందుకు సర్టిఫికెట్లు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు కోడిగుడ్లతోపాటు పౌష్టికాహారం అందిస్తున్నందున వినియోగించుకోవాలని తల్లిదండ్రులను ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బమ్మెర ప్రధానోపాధ్యాయురాలు విశాలాక్షి, ఉపాధ్యాయుడు రమేశ్, భిక్షం ,నాగమణి, శ్రావణి, కోమల, స్వర్ణలత పాల్గొన్నారు.

తరిగొప్పులలో..

తరిగొప్పుల : మండలంలోని అంకుషాపూర్, బంజరుపల్లి, అబ్దుల్‌నాగారం, జాలుబాయి తండాలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత శుక్రవారం పరిశీలించారు. చిన్నారులకు ప్రీ స్కూల్ విద్యపై మాట్లాడారు. చిన్నారుల భవిష్యత్‌కు బాటలు వేసేలా తల్లిదండ్రులు చేయూతనందించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను ఆటపాటలతో నీతి కథలు నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, కార్యదర్శిలు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్ : మండలంలోని కూనూరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ప్రీ స్కూల్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆటపాటలతో అలరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నేర్చుకున్న విద్యను చదివి వినిపించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుందరి, సంధ్యారాణి, రజిత పాల్గొన్నారు.